# సమన్వయంతో పని చేయాలి

## ఎన్నికల పరిశీలకురాలు ప్రియాంక శుక్లా

మేడ్చల్, ఏప్రిల్ 27: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు నోడల్, పోలీస్ అధికారులు సమన్వయంతో పని చేయాలని సాధారణ పరిశీలకురాలు డాక్టర్ ఎంఎస్ ప్రియాంక శుక్లా సూచించారు. కలెక్టరేట్‌లోని వీసీహాల్‌లో శనివారం జరిగిన సమావేశంలో పోలీస్ పరిశీలకుడు డాక్టర్ రామేశ్వర్‌సింగ్, వ్యయ పరిశీలకుడు మనోజ్ ఆలోయిస్ లక్రా, ధృవ్‌భోళా, జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రియాంక మాట్లాడుతూ.. ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు అధికారులు తమకు కేటాయించిన విధులను సమన్వయంతో నిర్వహించాలన్నారు. ఎస్ఎస్‌టీ, ఎఫ్ఎస్‌టీ, వీఎస్‌టీ, అకౌంటింగ్ టీం, ఎంసీఎంసీ, ఎంఎసీఎంసీ, నోడల్ అధికారులు ఆదేశించారు. సమావేశంలో జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ గౌతమ్ పోలింగ్ సరళిపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. లోక్‌సభ నియోజకవర్గంలో స్వేచ్ఛగా శాంతియుత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు కృషి చేస్తున్నారన్నారు. జిల్లాలో మొత్తం 37,79,596 ఓటర్లు ఉన్నారని, జిల్లాలో ఫ్లైయింగ్ స్క్వాడ్ టీంలు 24 గంటలు పర్యవేక్షణలో నిమగ్నమయ్యారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్నందున పార్టీల అభ్యర్థులు చేసే ప్రతి ఖర్చును ఎప్పటికప్పుడు నమోదు చేయాలని ఆదేశించారు. డీసీపీ పద్మ మాట్లాడుతూ.. ఎన్నికల విధులను పోలీస్ సిబ్బందికి ఇప్పటికే వివరించామన్నారు. సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించామని, సరిహద్దు చెక్‌పోస్టుల్లో పూర్తి నిఘాతో నిరంతరం తనిఖీలు చేపడుతున్నామన్నారు. ఎంఎంసీ కమిటీ ద్వారా చెల్లింపు వార్తలను గుర్తించడం, ప్రచురణ ముందస్తు అనుమతులు లేకుండా ప్రకటనలు ప్రచారం చేయడం, సంబంధిత అభ్యర్థి ప్రచార వ్యయంతో వాటిని లెక్కించడంపై పరిశీలన చేస్తున్నట్లు తెలిపారు. సోషల్ మీడియాలో అభ్యర్థులు రాజకీయ ప్రకటనల వంటి అంశాలపై సకాలంలో ఆమోదిస్తూ మంజూరు చేయాలని సూచించారు. ఎన్నికల నియమ నిబంధనలను ఉల్లంఘించడంపై సమర్థవంతమైన చర్యలు తీసుకోవడానికి సాధారణ ప్రజలు సీ విజిల్ యాప్‌ను ఉపయోగించవచ్చన్నారు. ఈ యాప్ మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్‌కి సంబంధించిన ఫిర్యాదులను కేవలం 100 నిమిషాల్లో పరిష్కరిస్తామన్నారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్ అభిలాశ్ అభినవ్, డీసీపీ నిఖిత పంత్, అడిషనల్ కలెక్టర్లు అభిషేక్ అగస్త్య, విజయేందర్‌రెడ్డి, డీఆర్‌వో హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎన్నికల పరిశీలకురాలు ప్రియాంక శుక్లా పాల్గొన్న కలెక్టర్ గౌతమ్, అధికారులు

### ఎన్నికల రెండో ర్యాండమైజేషన్

మేడ్చల్, (నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి లోక్‌సభ ఎన్నికల నిర్వహణలో భాగంగా మేడ్చల్-మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్‌లో శనివారం రెండో ర్యాండమైజేషన్ ప్రక్రియ చేపట్టారు. ఎన్నికల సాధారణ పరిశీలకురాలు డాక్టర్ ఎంఎస్ ప్రియాంక శుక్లా పర్యవేక్షణలో జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ సమావేశమయ్యారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలోని మేడ్చల్, మల్కాజిగిరి, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఉప్పల్ నియోజకవర్గాల్లో 2,425 పోలింగ్ కేంద్రాలున్నాయి. ఇందుకు గాను 12,230 మంది సిబ్బందిని రెండో విడత ర్యాండమైజేషన్ ద్వారా ఎంపిక చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి గౌతమ్ వెల్లడించారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు ప్రిసైడింగ్, సహాయ ప్రిసైడింగ్, ఓపీఓలను కేటాయించినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు విజయేందర్‌రెడ్డి, అభిషేక్ అగ్యస్త, డీఆర్వో హరిప్రియ తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజిగిరి లోక్‌సభ ఓటర్లు 37లక్షలు

తుది జాబితాలో పెరిగిన సంఖ్య 51వేలు

మేడ్చల్, ఏప్రిల్, 27(నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి లోక్‌సభ ఓటర్ల తుది జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. మల్కాజిగిరి లోక్‌సభ పరిధిలో 37,79,596 ఓటర్లు ఉన్నారు. లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో మేడ్చల్, మల్కాజిగిరి, ఉప్పల్, కుత్బుల్లాపూర్, కూకట్‌పల్లి, ఎల్బీనగర్, కంటోన్మెంట్ అసెంబ్లీ నియోజకవర్గాలు ఉన్నాయి.

### నియోజవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

| నియోజకవర్గం | పోలింగ్ కేంద్రాలు | పురుషులు | మహిళలు | ట్రాన్స్‌జెండర్స్ | మొత్తం |
|---|---|---|---|---|---|
| మేడ్చల్ | 580 | 3,40,218 | 3,25,703 | 58 | 6,65,979 |
| మల్కాజిగిరి | 411 | 2,55,325 | 2,52,712 | 11 | 5,08,048 |
| కుత్బుల్లాపూర్ | 582 | 3,78,362 | 3,46,468 | 162 | 7,24,992 |
| కూకట్‌పలి | 417 | 2,51,424 | 2,30,506 | 126 | 4,82,056 |
| ఉప్పల్ | 407 | 2,79, 495 | 2,60,516 | 41 | 5,40,052 |
| కంటోన్మెంట్ | 232 | 1,26,699 | 1,26,997 | 10 | 2,53,706 |
| ఎల్‌బీనగర్ | 570 | 3,14,101 | 2,90,528 | 134 | 6,04,763 |



మల్కాజిగిరిలో పెరిగిన ఓటర్లు 51,179

2024 ఫిబ్రవరి 8న విడుదల చేసిన ఓటరు జాబితాలో 37,28,417 ఓటర్ల సంఖ్య ఉండగా ఈనెల 25న విడుదల చేసిన ఓటరు జాబితాలో 37,79,596 ఓటర్ల సంఖ్య చేరింది. దీంతో తుది జాబితాలో 51,179 ఓటర్ల సంఖ్య పెరిగింది.

## ప్రజాస్వామ్య పునాదులపై మోదీ దాడులు

### ఆప్ రాష్ట్ర కన్వీనర్ దిడ్డి సుధాకర్

కవాడిగూడ, ఏప్రిల్ 27: ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపడం అంటే ప్రజాస్వామ్య పునాదులపై మోదీ దాడులు చేయడమేనని ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కన్వీనర్ డాక్టర్ దిడ్డి సుధాకర్ అన్నారు. నిరూపనలేని తప్పుడు కేసులతో ఎన్నికలకు ముందు ఈడీ ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్‌ను అరెస్ట్ చేసి జైలుకు పంపడం అప్రజాస్వామికమని పేర్కొన్నారు. కేజ్రీవాల్‌ను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ.. బెంగళూరుకు చెందిన ఆప్ కార్యకర్త మనోజ్‌కుమార్‌యాదవ్ చేపట్టిన దేశవ్యాప్త బైక్‌యాత్ర శనివారం హైదరాబాద్‌కు చేరుకుంది. లిబర్టీలోని ఆప్ రాష్ట్ర కార్యాలయం డాక్టర్ సుధాకర్, ఆప్ కోర్ కమిటీ సభ్యుడు బుర్రా రాముగౌడ్ మనోజ్‌కుమార్‌కు స్వాగతం పలికారు. సుధాకర్ మాట్లాడుతూ, ఆప్ కార్యకర్త, స్విగ్గీ డెలివరీ బాయ్ మనోజ్ దేశ వ్యాప్త బైక్ యాత్రను చేపట్టడం, ప్రజాస్వామ్య రక్షణకై ఇండియా కూటమిని గెలిపించాలని కోరడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో ఆప్ అధికార ప్రతినిధులు జావేద్ షరీఫ్, విజయ్, దివ్యాంగ కన్వీనర్ రమేశ్, మీడియా ఇన్‌చార్జి సోహైల్ పాల్గొన్నారు.





విద్యార్థులు రూపొందించిన రీయూజబుల్ ఉత్పత్తులను చూపుతున్న నటుడు అడవి శేషు

## టీ-వర్క్స్‌లో 'డిజైన్ వాన్‌గార్డ్-2024'

కొండాపూర్, ఏప్రిల్ 27: వోక్సెన్ వర్సిటీ విద్యార్థులు పలు డిజైన్లతో రూపొందించిన 20 ప్రాజెక్టలను నాలెడ్జ్ సిటీలోని టీ-వర్క్స్‌లో 'డిజైన్ వాన్‌గార్డు -2024' పేరిట షోను ఏర్పాటు చేశారు. పలు రకాల రీయూజబుల్ ఉత్పత్తులను ప్రదర్శించారు. ఇందులో 20 ప్రాజెక్టలను ఆవిష్కరించారు. ఇలాంటి ప్రదర్శనల ద్వారా విద్యార్థుల్లోని అత్యుత్తమ ప్రతిభా నైపుణ్యాలు ప్రపంచానికి చాటి చెప్పేందుకు అవకాశం సినీ నటుడు, దర్శకుడు అడవి శేషు అన్నారు. విద్యార్థుల ర్యాంప్ వాక్ ఆకట్టుకుంది. వర్సిటీ అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## మెరుగుపడిన భూసారం, జీవవైవిధ్యం

- ఫార్మర్ మేనేజ్డ్ నేచురల్ రీజనరేషన్ విధానంతో ఇక్రిసాట్ ప్రయోగం
- అందుబాటులోకి వచ్చిన 3 మిలియన్ హెక్టార్ల చౌడు నేలలు





సిటీబ్యూరో, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): చౌడు నేలలను వినియోగంలోకి తీసుకువచ్చేలా ఇక్రిసాట్ చేసిన ప్రయోగం సత్ఫలితాలనిచ్చింది. ఉష్ణమండల ప్రాంతాల్లో ఎక్కువగా ఉండే చౌడు నేలలను సారవంతమైన భూములుగా తీర్చిదిద్ది, తరిగిపోతున్న వ్యవసాయ భూముల విస్తీర్ణం పెంచడమే లక్ష్యంగా అధ్యయనం చేసింది. పైలట్ ప్రాజెక్టుగా ఆఫ్రికాలోని అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే ప్రాంతాలను ఎంపిక చేసుకొని, ఫార్మర్ మేనేజ్డ్ నేచురల్ రీజనరేషన్(ఎఫ్ఎంఎన్ఆర్) విధానాన్ని అమలు చేశారు. స్థానిక రైతుల భాగస్వామ్యంతో చేపట్టిన ఈ విధానం వల్ల ఏకంగా 3 మిలియన్ హెక్టార్ల భూములు వినియోగంలోకి వచ్చాయి. దీంతో పిచ్చి మొక్కలు పెరగని భూములు ఆహార పంటలకు అనువుగా మారినట్లుగా ఇక్రిసాట్ వర్గాలు పేర్కొన్నాయి. వెస్ట్ ఆఫ్రికాలోని పలు ప్రాంతాల్లో చేపట్టిన ఎఫ్ఎంఎన్ఆర్ విధానం ద్వారా చౌడు నేలల్లోనూ పోషకాలు పెరిగి, భౌగోళికంగా మార్పులు చోటు చేసుకున్నాయని అన్నారు. పర్యావరణహితమైన విధానాలతో స్థానికంగా బయోడైవర్సిటీ మెరుగుపడినట్లుగా గుర్తించారు.

## ఇంధన వనరుల్లో భూఉష్ణ శక్తే ఆశాకిరణం

### ఎన్జీఆర్ఐ మేధోమథనంలో ప్రముఖుల అభిప్రాయం

### దేశంలో పుష్కలంగా జియోథర్మల్ వనరులు ఉన్నాయంటున్న నిపుణులు

సిటీబ్యూరో, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): శిలాజ ఇంధన వనరులు తరిగి, సహజ ఇంధనశక్తిపై ఆధారపడుతున్న తరుణంలో.. భూఉష్ణ శక్తి అత్యంత కీలకంగా మారుతుందని ఎన్‌జీఆర్ఐ పరిశోధకులు అన్నారు. భూమి పొరల్లో ఉష్ణశక్తిని వెలికి తీసి, ఇంధన శక్తిగా మార్చుకునే వీలు ఉందంటున్నారు. ఇది ఇంధన వనరులకు ప్రత్యామ్నాయ ఇంధనంగా మారి దేశీయంగా శక్తి వనరులకు ఆశాకిరణం కానుందని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఎన్జీఆర్ఐ ఆధ్వర్యంలో జరిగిన జియోథర్మల్ పవర్ మేధోమథన సదస్సుల్లో భూఉష్ణ శక్తి ప్రాముఖ్యత, ప్రయోజనాలు, లభ్యతపై చర్చించారు. దేశంలోని భూ, భౌగోళిక పరిశోధకులు, ఇంధన వనరుల సంస్థల ప్రతినిధులు హాజరయ్యారు. కేంద్ర భూ విజ్ఞాన మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో జరిగిన సదస్సులో కేంద్ర కార్యదర్శి రవిచంద్రన్ అధ్యక్షత వహించగా, జియోథర్మల్ శక్తి వనరుల అభివృద్ధిపై సంబంధిత శాఖల నిపుణులు, పరిశోధకులు పాల్గొన్నారు. ఎన్జీఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ప్రకాశ్‌కుమార్ మాట్లాడుతూ.. జియో థర్మల్ వనరులు కనుగొనడంలో సర్వే కీలకమన్నారు. వనరుల



అన్వేషణలో పరిశోధకులు, నిపుణులు చురుగ్గా పరిశోధనల్లో భాగస్వామ్యం కావాలన్నారు. సాంకేతికంగా, ఆర్థికంగా సాధ్యాసాధ్యాలపై అంచనా వేయాల్సిన అవసరం ఉందన్నారు. వనరుల అన్వేషణ వేగవంతానికి జాతీయస్థాయిలో ప్రత్యేక స్టీరింగ్ కమిటీ ఏర్పాటు చేయాలని ఆయిల్ ఇండియా చైర్మన్ రంజిత్ రాథ్ సూచించారు. లోతైన బోర్‌వెల్స్‌ను వనరుల అన్వేషనకు వినియోగించుకోవాలని ఆయన అన్నారు. ఇటీవల లడాఖ్‌లో 1 మెగావాట్ సామర్థ్యం కలిగిన జియో థర్మల్ పవర్ బోర్‌వెల్స్‌ను కనుగొన్నట్లుగా ఓఎన్‌జీసీ డైరెక్టర్ జనరల్ రవి తెలిపారు. శిలాజ ఇంధన వనరులకు ప్రత్యామ్నాయంగా సుస్థిరమైన శక్తి వనరులుగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో ఎన్జీఆర్ఐ చీఫ్ సైంటిస్ట్ అభయ్ రామ్ భన్సాల్, కన్వీనర్ బీపీకే పాత్రో, కో-కన్వీనర్ లబానీ రే, పలు శాఖల నిపుణులు ఉన్నారు.

## తనిఖీల్లో రూ.82,40,200 నగదు సీజ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల దరిమిలా చేపట్టిన తనిఖీల్లో శనివారం ఆధారాలు లేకుండా తరలిస్తున్న రూ. 82,40,200 నగదు సీజ్ చేసినట్లు జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ తెలిపారు. దీనితో పాటు 11,19,473 వివిధ రకాల ఇతర వస్తువులు, 60.89 లీటర్ల మద్యం పట్టుకున్నామన్నారు. నాలుగు కేసులు నమోదు, నలుగురిని అరెస్టు చేశామన్నారు. తమకు 17 ఫిర్యాదులు రాగా వాటిని పరిష్కరించామని, ఏడుగురిపై ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు చెప్పారు. ఎన్నికల నోటిఫికేషన్ వెలువడినప్పటి నుంచి ఇప్పటివరకు రూ.17.49 కోట్ల నగదు సీజ్ చేశామన్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ట్రైనర్లతో జరిగిన సమావేశంలో కమిషనర్ పలు సూచనలు చేశారు. ఎన్నికల అధికారులు, సిబ్బందికి ఓటు వేసేందుకు పోస్టల్ బ్యాలెట్ ద్వారా ఓటు వేసేందుకు అవకాశం కల్పించినట్లు చెప్పారు. సొంతూరిలో ఓటు వినియోగించుకోవాలంటే స్పెషల్ క్యాజువల్ లీవ్ కూడా తీసుకోవచ్చన్నారు. సమావేశంలో అడిషనల్ కలెక్టర్ హేమంత్ కేశవ్‌పాటిల్, కంటోన్మెంట్ సీఈఓ మధుకర్‌నాయక్, డిప్యూటీ కలెక్టర్ విజయలక్ష్మి, ట్రైనింగ్ నోడల్ అధికారి సునంద, డీఎల్‌టీ మమత, చీఫ్ ఎంటమాలజి డా.రాంబాబు పాల్గొన్నారు.

## విశ్వవ్యాప్త చిత్రకారుడు డాక్టర్ 'కొండపల్లి'

ఆర్కేపురం, ఏప్రిల్ 27: డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు విశ్వవ్యాప్త చిత్రకారుడని ప్రముఖ కవి ఆచార్య ఎన్.గోపి అన్నారు. శనివారం కొత్తపేటలో చిత్రకళా తపస్వి డాక్టర్ కొండపల్లి శేషగిరిరావు కి జవాన్ గాథ హిందీ అనువాద గ్రంథావిష్కరణ జరిగింది. దూరదర్శన్ విశ్రాంత సంచాలకుడు డాక్టర్ ఓలేటి పార్వతీశం అధ్యక్షతన వహించగా ఎన్.గోపి ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. శేషగిరిరావు పోరాట, ప్రకృతి చారిత్రక పౌరాణిక స్వతంత్ర సంప్రదాయం వంటి అన్ని కోణాల్లో వేలాది చిత్రాలు చేశారని తెలిపారు. కార్యక్రమంలో ప్రముఖ చిత్రకారులు నరేంద్రరాయ్, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత వారాల ఆనంద్, గ్రంథ అనువాద రచయిత డాక్టర్ మరింగంటి లక్ష్మీనాచార్యులు, మూల రచయిత, సాహిత్య విమర్శకురాలు డా.నీహారిని పాల్గొన్నారు.



హిందీ అనువాద గ్రంథాలను ఆవిష్కరిస్తున్న ఆచార్య ఎన్.గోపి, ఓలేటి పార్వతీశం

## 37 నామినేషన్లు ఆమోదం

మేడ్చల్, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): మల్కాజిగిరి లోక్‌సభ స్థానానికి దాఖలైన నామినేషన్లలో 37 మంది అభ్యర్థుల నామినేషన్లు ఆమోదం పొందాయి. మల్కాజిగిరి లోక్‌సభ నియోజకవర్గ అభ్యర్థిత్వానికి 114 మంది 177 నామినేషన్లు దాఖలు చేయగా, పరిశీలన అనంతరం 77 మంది అభ్యర్థుల నామినేషన్లు ఎన్నికల అధికారులు తిరస్కరించారు. కాగా నామినేషన్ల ఉపసంహరణకు ఈనెల 29 వరకు ఉన్నట్టు అధికారులు పేర్కొన్నారు.

## హైటెక్ సిటీలో కోహ్లీ రెస్టారెంట్

### త్వరలో 'వన్ 8 కమ్యూన్' ప్రారంభం

సిటీబ్యూరో, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): ప్రముఖ క్రికెటర్ విరాట్ కోహ్లీ హైదరాబాదీలకు మరింత దగ్గరకానున్నారు. నగరవాసులకు విభిన్న రకాల రుచులను అందించేందుకు సిద్ధమయ్యారు. ఇప్పటికే ఢిల్లీ, పూణే, ముంబై, కోల్‌కత్తా, బెంగళూరులో విజయవంతంగా కొనసాగుతున్న 'వన్ 8 కమ్యూన్' రెస్టారెంట్‌ను హైదరాబాద్‌లో ప్రారంభించేందుకు రెడీ అయ్యారు. హైటెక్ సిటీలో ఈ రెస్టారెట్ రాబోతోంది. ఇటీవల నగరంలో జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌కు వచ్చిన అతడు తన రెస్టారెంట్ పనులను పరిశీలించారు. ఈ వీడియో సైతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కోహ్లీ రెస్టారెంట్ అభిమానుల్లో ఉత్సాహం నింపుతోంది. విరాట్ ఇటు క్రికెట్‌లో.. అటు ఎంట్రప్రెన్యూర్ గానూ అందరికీ ఆదర్శంగా నిలుస్తున్నాడంటూ అభిమానులు ప్రశంసలు కురిపిస్తున్నారు.

## మత రాజకీయాలు పనిచేయవు

### మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి





ఈద్ మిలాప్ కార్యక్రమంలో మాట్లాడుతున్న శ్రీనివాస్‌రెడ్డి

ఖైరతాబాద్, ఏప్రిల్ 27: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగం ముందు మత రాజకీయాలు పనిచేయవని తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. రంజాన్, ఉగాదిని పురస్కరించుకొని సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఈద్ మిలాప్ నిర్వహించారు. తెలంగాణ స్మాల్ న్యూస్ పేపర్స్, మ్యాగజైన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అధ్యక్షుడు యూసుఫ్ బాబు అధ్యక్షతన 'ఎన్నికలు-లౌకికవాదం' అంశంపై చర్చ నిర్వహించారు. శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. రాజ్యాంగం అమలులోకి వచ్చిన తర్వాత మనుధర్మాన్ని ముందుకు తేవాలన్న ప్రయత్నాలు ఫలించలేదన్నారు. దేశంలో మత రాజకీయాలు నిలువవని అభిప్రాయపడ్డారు. కార్యక్రమంలో టీఎస్‌పీఎస్సీ మాజీ చైర్మన్ ఘంటా చక్రపాణి, టీయుడబ్ల్యూజే ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలీ, రవీందర్ రెడ్డి, కరుణాకర్ దేశాయి తదితరులు పాల్గొన్నారు.

## కంప్యూటర్ ఉచిత శిక్షణకు ఆహ్వానం

కవాడిగూడ, ఏప్రిల్ 27: అప్సా సంస్థ ఆధ్వర్యంలో క్వెస్ట్ అలయన్స్ సహకారంతో యువతకు కంప్యూటర్ ఉచిత శిక్షణకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు అప్సా ప్రతినిధి ప్రవీణ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 30 ఏండ్లు నిండిన నిరుద్యోగ యువత అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. శిక్షణలో ఎంఎస్ ఆఫీస్, అడ్వాన్స్ ఎక్సల్, లైఫ్ స్కిల్స్, ఇంటర్నెట్ శిక్షణ, స్పోకెన్ ఇంగ్లిష్, పవర్ పాయింట్ అంశాల్లో శిక్షణతోపాటు ఉద్యోగ అవకాశం కల్పిస్తామని తెలిపారు. శిక్షణకు దరఖాస్తు చేసుకునే వారు 2 పాస్ ఫొటోలు, 10వ తరగతి మెమో, ఆధార్ కార్డు అవసరమన్నారు. చిరునామా.. రాంనగర్ గుండు నియర్ ఏషియన్ బేకరీ, జీహెచ్ఎంసీ వార్డ్ ఆఫీస్, టీఆర్టీ ప్లే గ్రౌండ్ జవహర్‌నగర్ లేదా మరిన్ని వివరాల కోసం 88975 73878, 99664 58891 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.



బాగ్అంబర్‌పేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే వెంకటేశ్, ఇన్‌చార్జి దాసోజు శ్రావణ్

## పద్మారావు గెలుపు ఖాయం

### అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్

అంబర్‌పేట, ఏప్రిల్ 27: సికింద్రాబాద్‌లో బీఆర్ఎస్ అభ్యర్థి టి.పద్మారావు గెలుపు ఖాయమని అంబర్‌పేట ఎమ్మెల్యే కాలేరు వెంకటేశ్ అన్నారు. పద్మారావుకు మద్దతుగా బాగ్అంబర్‌పేట డివిజన్‌లో నిర్వహించిన ప్రచారానికి నియోజకవర్గ ఎన్నికల ఇన్‌చార్జి దాసోజు శ్రావణ్ హాజరయ్యారు. కార్పొరేటర్ బి.పద్మవెంకటరెడ్డి, మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి, డివిజన్ అధ్యక్షుడు సీహెచ్ చంద్రమోహన్‌తో కలిసి డివిజన్‌లోని జంజం మసీదు, మల్లన్నగుడి, పోచమ్మబస్తీ, బతుకమ్మకుంట, వాంబేకాలనీ ప్రాంతాల్లో ఇంటింటికీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ముఖ్యమంత్రిగా కేసీఆర్ చేసిన అభివృద్ధిని వివరిస్తూ బీఆర్ఎస్ పార్టీకి మద్దతు తెలపాలని కోరారు. ప్రస్తుత బీఆర్ఎస్ అభ్యర్థి పద్మారావు చాలా మంచి వ్యక్తి అని, ఎప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటారని చెప్పారు. ప్రజా సమస్యలపై ఎల్లప్పుడూ స్పందించే వ్యక్తి అని వివరించారు. కారు గుర్తుకు ఓటు వేసి పద్మారావును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివిజన్‌కు చెందిన పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## బీజేవైఎం సభ అట్టర్‌ఫ్లాప్



శంషాబాద్ పట్టణంలో నిర్వహించిన బీజేవైఎం సమ్మేళనంలో ఖాళీగా కనిపిస్తున్న హాల్

శంషాబాద్ రూరల్, ఏప్రిల్ 27: చేవెళ్ల లోక్‌సభ బీజేపీ అభ్యర్థి గెలుపు కోసం నిర్వహించిన బీజేవైఎం సభ అట్టర్‌ఫ్లాప్ అయ్యింది. రంగారెడ్డి బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు యాదీశ్ ఆధ్వర్యంలో శనివారం శంషాబాద్ పట్టణంలోని వైఎస్ఆర్ గార్డెన్‌లో సమ్మేళనం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా వచ్చిన చేవెళ్ల బీజేపీ అభ్యర్థి కొండా విశ్వేశ్వర్‌రెడ్డి మాట్లాడేలోపే యువకులు సమావేశం నుంచి వెళ్లిపోయారు. ఆయన మాట్లాడుతున్న సమయంలో కుర్చీలు ఖాళీగా దర్శనమిచ్చాయి. అయినా వచ్చినందుకు మాట్లాడక తప్పదని గమనించిన ఆయన తన ప్రసంగాన్ని ముగించి వెళ్లిపోయారు. కాగా, గతంలో ఎంపీగా పని చేసిన 'కొండా' చేవెళ్లలో అభివృద్ధి పనులు చేయకపోవడంతోనే ఆయనకు అనుకున్న స్థాయిలో మద్దతు రావడంలేదని ఆ పార్టీ నేతలే చర్చించుకుంటున్నారు. మైలార్‌దేవ్‌పల్లి కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, బీజేవైఎం రాష్ట్ర అధ్యక్షుడు మహేందర్ పాల్గొన్న సమ్మేళనం అనుకున్న స్థాయిలో విజయవంతం కాకపోవడంతో అసంతృప్తికి గురయ్యారు.

## బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి కృషి: రొనాల్డ్ రాస్



సిటీబ్యూరో, ఏప్రిల్ 27(నమస్తే తెలంగాణ): బ్యాడ్మింటన్ క్రీడాభివృద్ధికి పూర్తి సహకారం జీహెచ్ఎంసీ అందిస్తుందని కమిషనర్ రోనాల్డ్ రాస్ అన్నారు. జాతీయ బ్యాడ్మింటన్ క్రీడాకారులు కుమారి సిక్కిరెడ్డి, సుమిత్‌రెడ్డి శనివారం కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. బ్యాడ్మింటన్‌పై అందరికీ ఆసక్తి ఉంటుందని అన్నారు. కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ప్లేగ్రౌండ్, సనత్‌నగర్ ఇండోర్‌స్టేడియాలను పరిశీలించి అనువైన క్రీడా ప్రాంగణం గుర్తించి అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని వివరించారు. కమిషనర్ ఆదేశాలతో సంబంధిత అధికారులు బ్యాడ్మింటన్ వేదిక కోసం ఆదివారం పలు మైదానాలను పరిశీలించనున్నారు.

## ఓటు వేసే బాధ్యతను మరిచిపోవద్దు

### సీఈవో వికాస్ రాజ్

సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ): లోక్‌సభ ఎన్నికల్లో భాగంగా మే 13న జరిగే పోలింగు రోజున ప్రతిఒక్క ఓటరు ఓటు వేసే బాధ్యతను మరచిపోవద్దని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ అన్నారు. శనివారం ఎస్సార్‌నగర్‌లో జీహెచ్ఎంసీ కమిషనర్, జిల్లా ఎన్నికల అధికారి రోనాల్డ్ రాస్ సీఈవో ఇంటి వద్దకు వెళ్లి పోలింగ్ తేదీ ఉన్న ఓటర్ ఇన్ఫర్మేషన్ స్లిప్, 'ఓటరుగా గర్వపడుతున్నాను' అనే స్టిక్కర్‌ను అందజేశారు. సీఈవో మాట్లాడుతూ.. ప్రలోభాలకు లొంగకుండా నిర్భయంగా ఓటు వేయాలని ఓటర్లకు పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య మనుగడ, దేశ భవిష్యత్తుకు ఓటు ఆయుధం లాంటిదన్నారు. మే 13ను ప్రజాస్వామ్య పండుగ రోజుగా భావించాలని అన్నారు. కమిషనర్ ఇంటింటికీ ఓటర్ స్లిప్, స్టిక్కర్ పంపిణీ వివరాలను సీఈవోకు వివరించారు. అసెంబ్లీ ఎన్నికల కంటే ఈసారి ఎక్కువ శాతం స్లిప్‌ల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. అంతకు ముందు జీహెచ్ఎంసీ కమిషనర్ రోనాల్డ్ రాస్ డీజీపీ ఇంటికి వెళ్లి ఓటర్ స్లిప్ అందజేశారు. డీజీపీ మాట్లాడుతూ.. పోలింగ్ రోజు అవాంఛనీయ ఘటనలు జరగకుండా పటిష్టమైన భద్రత చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ బి.హేమంత్ సహదేవ్‌రావు, జూబ్లీహిల్స్, బేగంపేట డీసీ ప్రశాంతి, సమ్మయ్య కమిషనర్లు ఉన్నారు.





తెలంగాణ భవన్‌లో మే 1న ఉదయం 10 గంటలకు టీఏటీయూ, బీఆర్‌టీయూ ఆధ్వర్యంలో కార్మిక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నట్లు టీఏటీయూ ఆటో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వేముల మారయ్య తెలిపారు. ముఖ్య అతిథిగా బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హాజరుకానున్నట్లు చెప్పారు. శ్రమజీవుల సమక్షంలో జెండా ఆవిష్కరణ ఉంటుందన్నారు. ఈ మేరకు శనివారం కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను నాచారంలోని టీఏటీయూ కార్యాలయంలో మారయ్య ఆవిష్కరించారు. శ్రీనివాస్, ఎల్. రవి, తిరుమల పరశురాం తదితరులు పాల్గొన్నారు.

– సిటీబ్యూరో, ఏప్రిల్ 27 (నమస్తే తెలంగాణ)